వైఎస్ఆర్

అశ్వవాహనంపై వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబ

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

జగద్గురు శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం ఉదయం శ్రీ గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి అశ్వ వాహనంపై ఊరేగారు. ఆరు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు పిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్యాచారి ఆరాధనకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా ఎస్ఐ విద్యాసాగర్ గట్టి బందోబస్తు నిర్వహించారు.

మహిళా చైతన్యం

కడపలో 37,406 మహిళల ఓట్లు
అన్నమయ్య జిల్లాలో 25,947 ఓట్లు
ప్రొద్దుటూరులో అత్యధికంగా 7,948 ఓట్లు
గెలుపోటములపై గణనీయ ప్రభావం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రికంలో మహిళా చైతన్యం వెల్లివిరిసింది. కడప పార్లమెంట్‌లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 37 వేలు, రాజంపేట పార్లమెంట్‌లో 26 వేల ఓట్లపైగా నమోదు కావడం గమనార్హం. 1996 ఎన్నికల అనంతరం ఎన్నడూలేని విధంగా పోటాపోటీగా సాగిన తాజా ఎన్నికల్లో ఎవరు గెలిచినా స్వల్పమెజార్టీలతో గెలిచే అవకాశాలు ఉన్నాయనే అంచనాల నేపథ్యంలో మహిళా ఓటరు కీలకపాత్ర పోషించే అవకాశం ఉందనే విశ్లేషణ వినిపిస్తోంది. కడప పార్లమెంట్‌లో 16,39,066 మంది ఓటర్లలో పురుష ఓటర్లు 8,00,857 మంది, మహిళా ఓటర్లు 8,37,993 మంది, ఇతర ఓటర్లు 216 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 37,406 మంది ఉండడం గమనార్హం. రాజంపేట పార్లమెంట్‌లో 14,26,834 లక్షల ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 7,00,380 మంది, మహిళా ఓటర్లు 7,26, 327 మంది, ఇతరులు 91 మంది ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 25.947 వేల మంది అధికంగా ఉండడం గమనార్హం. కడప పార్లమెంట్ పరిధిలోని కడప అసెంబ్లీలో 2,83,543 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,38,300 మంది, మహిళా ఓటర్లు 1,45,152 మంది, 90 మంది ఇతరులు ఉన్నారు. సుమారు 6,852 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. బద్వేల్ అసెంబ్లీలో 2,19,290 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,09,163 మంది, మహిళా ఓటర్లు 1,10,122 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. 959 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. పులివెందుల అసెంబ్లీలో 2,29,687 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,11,727 మంది, మహిళా ఓటర్లు 1,17,941 మంది, ఇతరులు 19 మంది ఉన్నారు. 6,214 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. కమలాపురం అసెంబ్లీలో 2,04,169 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 99,851 మంది, మహిళా ఓటర్లు 1,04,284 మంది ఓటర్లు, ఇతరులు 34 మంది ఉన్నారు. 4,433 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. జమ్మలమడుగు అసెంబ్లీలో 2,42,556 ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,17,746 మంది, మహిళా ఓటర్లు 1,24,795 మంది, ఇతర ఓటర్లు 15 మంది ఉన్నారు. 7,049 మంది ఓటర్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. ప్రొద్దుటూరు అసెంబ్లీలో 2,47,966 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,19,985, మహిళా ఓటర్లు 1,27,933, ఇతర ఓటర్లు 48 మంది ఉన్నారు. 7,948 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మైదుకూరు అసెంబ్లీలో 2,11,855 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 104,085 మంది, మహిళా ఓటర్లు 1,07, 765 మంది ఉన్నారు. 3,680 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. రాజంపేట పార్లమెంట్‌లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 25,947 మంది ఎక్కువగా ఉన్నారు. రాజంపేటలో 2,41,200 ఓటర్లు ఉండగా 1,83, 442 ఓట్లు నమోదయ్యాయి. పురుష ఓటర్లు 1,17,577 మంది, మహిళా ఓటర్లు 1,23,617 మంది ఉన్నారు. 6,040 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. రైల్వేకోడూరులో 2,04,456 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,00, 663 మంది, మహిళా ఓటర్లు 1,03,794 మంది ఉన్నారు. 3,131 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. రాయచోటిలో 2,55,168 మంది ఓటర్లు ఉన్నారు. 1,26,090 మంది పురుష ఓటర్లు, 1,29,051 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 2,961 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. తంబళ్లపల్లిలో 2,24,802 మంది ఓటర్లు ఉన్నారు. 1,10,627 మంది పురుష ఓటర్లు, 1,14,163 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 3,535 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. పీలేరులో 2,34,608 మంది ఓటర్లు ఉన్నారు. 1,14,962 మంది పురుష ఓటర్లు, 1,19,624 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 5,464 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. మదనపల్లిలో 2,66,590 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,30,461 మంది, మహిలా ఓటర్లు 1,36,078 మంది ఉన్నారు. 5,617 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. కడప, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని 13 అసెంబ్లీల బరిలో కడప పార్లమెంట్ బరిలో కాంగ్రెస్ తరుపున మహిళా అభ్యర్థి వైఎస్ షర్మిల, కడప అసెంబ్లీకి టిడిపి తరుపున ఆర్.మాధవి బద్వేల్ అసెంబ్లీ బరిలో కాంగ్రెస్ తరుపున విజయజ్యోతి, వైసిపి తరుపున డాక్టర్ సుధ, రైల్వేకోడూరు అసెంబ్లీ బరిలో కాంగ్రెస్ తరుపున గోశాల దేవి పోటీ చేసిన నేపథ్యంలో మహిళా ఓటర్లు మోస్తరుగా మహిళా అభ్యర్థులకు మద్దతుగా తెలిపి నట్లు తెలుస్తోంది.

కలసపాడులో బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్‌ఫొటో)

పోలీసుల వలయంలో జమ్మలమడుగు

దేవగుడి, నిడిజువ్విలలో ఆంక్షలు
144 సెక్షన్ అమలుకు కలెక్టర్ ఉత్తర్వులు

వైసిపి కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లా మొత్తం జమ్మలమడుగు వైపు పోలింగ్ రోజు నుంచి చూస్తూ ఉంది. అంతే ఉత్కంఠగా జమ్మలమడుగు ప్రజలు క్షణక్షణం ఏం జరుగు తుందోనని భయాందోళనలో ఉన్నారు. పోలీసుల వలయంలో జమ్మలమడుగు పట్టణం, మండలం ఉన్నాయి. ఈనెల 13 పోలింగ్ రోజున జమ్మలమడుగు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఉదయం నుంచి జమ్మలమడుగు మండలంలో పెద్దదండ్లూరు, బొమ్మేపల్లి, పెద్దమోడియం మండలంలో సుద్దపల్లి, చిదిపిరాళ్లదిన్నె వంటి గ్రామాలలో చిన్న చిన్న సంఘటనలు జరిగినా ప్రశాంతంగా పోలింగ్ ముగుస్తుందని అందరూ భావించారు. అయితే రాత్రి 7 నుంచి 8 గంటలలోపల ఒక్కసారిగా జమ్మలమడుగు పేరు వినపడేలా ఘర్షణ వాతావరణం తలెత్తింది. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని పోలింగ్ కేంద్రాలైన 116, 117 లలో ఓటర్లు ఓటింగ్ వేసేందుకు ఎక్కువగా ఉండడంతో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మూలే సుధీర్ రెడ్డి, కూటమి పార్లమెంటు అభ్యర్థి భూపేష్ రెడ్డి, బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి అక్కడికి చేరుకున్నారు. చిన్నగా మొదలపై గొడవ చివరకు పెద్దదైంది. ఘర్షణలో ఎంపీ అభ్యర్థి భూపేష్ కిందపడడం, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఇటుక పెళ్లతో దాడి చేయడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇరువురి నేతల వాహనాలు అద్దాలు పగలకొట్టారు. రంగ ప్రవేశం చేసిన డిఎస్‌పి యశ్వంత్ ఇరు పార్టీల నాయకులను సర్ది జెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈనేపథ్యంలో వైసిపి, కూటమి నాయకులు ఆయా పార్టీ కార్యాలయాల వద్దకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో పోలీసులు పార్టీ అభ్యర్థులను వారి సొంత గ్రామాలకు తరలించారు. అనంతరం జరిగిన పరిణామాలతో పట్టణంలో 144 సెక్షన్ కొనసాగుతుందని డిఎస్‌పి చెప్పారు. ఇదే మేరకు బుధవారం ఉదయం కలెక్టర్ విజయరామరాజు జమ్మలమడుగులో 144 సెక్షన్ అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దాడులు జరిగే అవకాశం ఉందని సమాచారం రావడం చేత పోలీసుల అలర్ట్, పారా మిలిటరీ బలగాలను జమ్మలమడుగు తరలి ంచాలని ఆదేశించారు. జమ్మలమడుగులో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసు కోకుండా సమస్యాత్మక గ్రామాల్లో, పార్టీ కార్యాల యాల వద్ద, టీ అంగళ్లు, బస్ షెల్టర్లు, ప్రజలు గుమికూడే ప్రదేశాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 500 మంది అదనపు పోలీస్ బలగాలను జమ్మలమడుగుకు డిజిపి పంపించారు. రౌడీ మూకలు, ప్రయివేటు సైన్యం దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. ఆ మేరకు జమ్మలమడుగు పట్టణంలోనూ, గొరిగనూరు, ధర్మాపురం, పెద్ద దండ్లూరు, దేవగుడి, సున్నపురాళ్లపల్లి, పాటి (చిటిమిటి చింతల), ముద్దనూరు లతోపాటు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సొంత గ్రామమైన నిడిజువ్విలో కూడా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. దేవగుడి నుంచి భూపేష్ సుబ్బరామిరెడ్డి, ఆదినారాయణ రెడ్డిని గ్రామం నుంచి బయటకు రాకుండా పోలీసులు పికెటింగ్ నిర్వహించారు. నిడి జువ్విలోనూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బయటకు రాకుం డా హౌస్ అరెస్టు చేశారు. మొత్తం పైన పోలీస్ బలగాలు అధిక సంఖ్యలో జమ్మలమడుగులో ఉండ డంతో ప్రజలలో భయాందోళన నెలకొంది. నియోజవర్గం మొత్తంపై జమ్మలమడుగులో హై టెన్షన్ ఏర్పడింది. ఎన్ని రోజులు ఈ పికెటింగ్, హైటెన్షన్ ఉంటుందని ప్రజలు చర్చించు కుంటున్నారు. వజ్ర వాహనం, పారా మిలటరీ, అదనపు పోలీస్ బలగాలతో జమ్మలమడుగు ప్రస్తుతం ఉంది. అవసరం ఉంటేనే తప్ప అనవ సరంగా బయట తిరగవద్దని పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. అనవసరమైన చర్చలు టీ షాపుల వద్ద, గుమికూడే ప్రదేశాలలో పెట్టవద్దని సూచిస్తున్నారు.

పలగాడి మోటు నుంచి సాయిరాం హాల్ వరకు నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

జిల్లా ప్రతిష్టను పెంచిన కట్టా నరసింహులు

విద్వాన్ కట్టా నరసింహులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు సాహిత్యం, జిల్లా చరిత్రలపై ఎంతో మమకారం ఉన్న విద్వాన్ కట్టా నరసింహులు కైఫియత్తుల పరిష్కారం ద్వారా మరుగున పడిన గొప్ప చరిత్రను వెలికితీసి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారని యోగి వేమన పాలక మండలి సభ్యులు, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ తొలి బాధ్యులు, కడప కైఫియత్తుల పరిష్కర్త విద్వాన్ కట్టా నరసింహులు 3వ వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఆధ్వర్యంలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించింది. తొలుత విద్వాన్ కట్టా చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సాహిత్యం కంటే కట్టా చరిత్ర పరిశోధనపై కృషిచేశారని, కైఫియత్తుల పరిష్కారంతో ఆయనకు తెలుగునాట విశేషమైన పేరు ప్రతిష్టలు లభించాయన్నారు. పోతన సాహిత్య పీఠం ఏర్పాటుతో పాటు ఒంటిమిట్టకు ప్రభుత్వ లాంఛనాలు దక్కేందుకు ఆయన చరిత్ర పరిశోధన ఎంతో ఉప యోగ పడిందన్నారు. బ్రౌన్ గ్రంథాలయంతో పాటు ఆయనకు బ్రహ్మంగారిమఠం, ఒంటిమిట్టలతో విడదీయలేని అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ విద్వాన్ కట్టా నరసింహులుకు జిల్లా రుణపడి ఉందని, ఆయనకెంతో ఇష్టమైన బ్రౌన్ గ్రంథాలయ ఆవరణలో బ్రౌన్ శాస్త్రి సరసన ఆయన శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సమంజసంగా ఉంటుందన్నారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, జానమద్ది నాగరాజు మాట్లాడుతూ కడప కైఫియత్తుల పరిష్కారం అనితర సాధ్యమని, ప్రతిభగల ప్రతివారిని విద్వాన్ కట్టా ఎంతో ఆత్మీయంగా ప్రోత్సహించేవారని ఆయనలేని లోటు తీర్చలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, చిత్రకారుడు వెంకటేష్, మధు, డేవిడ్, గొబ్బూరి కోటేశ్వరరావు, జ్యోతి జార్జి పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ అంతం

నేటి నుంచి బిసిజి టీకా పంపిణీ
అన్నమయ్య జిల్లా డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి-రాయచోటి

అవగాహనతోనే క్షయ వ్యాధి అంత మవుతుందని, ఈ నెల 16 నుంచి జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు బిసిజి ఉచిత టీకా పంపిణీ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖా ధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈ ఉచిత టీకా పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ వైద్య ఆరోగ్య శాఖకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో 2025 నాటికి టిబి నివారణే లక్ష్యంగా ఈ నెల 16 నుంచి జిల్లాలోని అన్ని సచివాలయాలలో ప్రతి గురువారం 3 నెలలు పాటు ప్రత్యేక శిక్షణ పొందిన ఆరోగ్య సిబ్బంది ద్వారా ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. 18 ఏళ్ల పైబడి ఐదేళ్లలోపు క్షయ కొరకు మందులు మింగి టిబి వ్యాధి నయం అయిన వారికి, క్షయవ్యా ధిగ్రస్థుల కుటుంబసభ్యులకు, మధుమేహ వ్యాధిగ్రస్థులకు, ధూమపానం సేవించే వారికి, 60 ఏళ్ల పైబడి వయస్సు కలవారికి ఈ బిసిజి ఉచిత టీకా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఆరోగ్య సిబ్బంది, సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులను, అంగన్వాడీ సిబ్బందిని, టిబి ఛాంపియన్లను సమన్వయ పరుచుకొని ఈ టీకా ప్రాముఖ్యత ప్రజలకు తెలియచేసి వాక్సిన్ కార్య క్రమంను విజయవంతం చేయుటకు కృషి చేయాల న్నారు. ఈ టీకా ప్రాముఖ్యత దృష్ట్యా మీడియా సహ కారం ఎంతో అవసరమని మీడియా వారందరూ కూడా కార్యక్రమ విజయవంతానికి సహకారిం చాలని పాత్రికేయులను కోరారు. రాష్ట్ర స్థాయి అధికారి డాక్టర్ దేవసాగర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఈ బిసిజి టీకా కార్యక్రమం ఎంపిక చేసిన జిల్లాలలో ప్రారంభిస్తామన్నారు. అన్నమయ్య జిల్లా బిసిజి టీకా పంపిణీ కార్యక్ర మానికి ఎంపిక అయినందున మన జిల్లాలో కూడా రేపటి నుంచి మూడు నెలల పాటు ప్రతి గురు వారం బిసిజి టీకా పంపిణీ చేయడానికి జిల్లా ఉన్నతాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కంద్రాల వైద్యా ధికారుల సహాయ సహకారాలతో అన్ని సచివాల యంలలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ వాక్సిన్ కార్యక్రమం ఎక్కడ ఆయితే జరుగుతుందో సంబంధిత ఆరోగ్య సిబ్బంది ముందుగానే మీమీ ఏరియా ప్రజలకు వాక్సిన్ యొక్క ప్రాముఖ్యతను తెలియచేసి వారి యొక్క సమ్మతితో ఈ వాక్సిన్ కార్యక్రమం జయప్రదం చేయాలని సూచించారు. గర్భిణులు, పాలు ఇచ్చు తల్లులకు, ఎచ్ఐవి వ్యాధి గ్రస్థులకు, కేన్సర్ పేషంట్లకు, మూడు నెలలలో రక్తమార్పిడి చేసుకున్న వారికి ఈ టీకా ఇవ్వడం జరగదని ప్రజలు అందరు అపోహలు వీడి స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి టిబి (క్షయ) రహిత సమాజం కోసం పాటుపడాలని తెలియచేశారు. కార్యక్రమాన్ని జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కార్యక్రమంలో పాల్గొని నిర్వహిస్తూ, పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

12,252 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు పచ్చిరొట్ట, వేరుశనగ, మినుము, పెసర, కందులు, రాగి, కొర్ర విత్తనాలు మంజూరు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12, 252 క్వింటాళ్లు విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. పచ్చి రొట్టె జిలుగులు 478 క్వింటాళ్లు, జనుము 463 క్వింటాళ్లు, పిల్ల పెసర 80, క్వింటాళ్లు వేరు శనగ 5849 క్వింటాళ్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం పచ్చి రొట్టె, వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవ కా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మంజూరైన విత్తనాలు రైతు లకు సబ్సిడీ ద్వారా ఆర్‌బికె, డికృషి యాప్ ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు.

విద్యార్థి సామర్థ్యం ఆధారంగా విద్యాబోధన

మాట్లాడుతున్న ఆర్‌జెడి రాఘవరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థి సామర్థ్యం ఆధారంగా విద్యార్థులకు వైయుక్తిక భేదాలు అనుగుణంగా విద్యాభ్యాసం చేయాలని పిఎఎల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లర్నింగ్) ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రాంతీయ సంచాలకులు జోన్-4 రాఘవ రెడ్డి, డిఇఒ అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీలో సమగ్ర శిక్ష ఎపిఒ రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాల లోని పిఎఎల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంగ్లీషు, గణిత ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో నోబుల్ అవార్డు గ్రహీత రాబర్ట్ మైకేల్ క్రేమర్ ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన కాన్వి జీనియస్ కంటెంట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా ప్రపంచంలోని 120 దేశాలు అమలు పరుస్తున్న పిఎఎల్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని 564 పాఠశాలల్లో 2019 నుంచి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పిఎఎల్ కార్యక్రమం ద్వారా 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు వారి వైయుక్తిక భేదాలకను గుణంగా విద్యాభ్యాసం నిర్వహించి ప్రతి విద్యార్థి ఆ తరగతికి గల సామర్థ్యాన్ని అందే విధంగా బోధన అభ్యసనం చేయాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులు చేయవలసిన విధి విధానాలు కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాల డిఎన్ఒ (జిల్లా నోడల్ ఆఫీసర్) అశోక్ రెడ్డి, దస్తగిరి రెడ్డి, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడిచారు

- టిడిపి కమలాపురం అభ్యర్థి చైతన్యరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా చైతన్యరెడ్డి

కడప జిల్లాలోని తెలుగుదేశం పార్టీ నేతలే ప్రతిపక్ష పాత్ర పోషించి సొంత పార్టీకి వెన్నుపోటు పొడిచారని కమలాపురం టిడిపి అభ్యర్థి పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం మండలంలోని కోగటం గ్రామంలో ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జ్ ప్రవీణ్ రెడ్డి, ఆయన తండ్రి ప్రతాప్ రెడ్డి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయొద్దని హుకుం జారీ చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కోగటం బ్రదర్స్ గుట్టు బట్ట బయలైందని నియోజకవర్గంలో ప్రజలందరూ ఛీదరించుకుంటున్నారన్నారు. ఒక పార్టీలో ఉంటూ అదే పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం దుర్మార్గమని తమకు నచ్చకపోతే వేరే పార్టీలో కొనసాగచ్చని హితవు పలికారు. ఈ విషయంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి తెలియజేస్తామని, పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు.

పిల్లల్లో సృజనాత్మక శక్తి అధికం

ప్రజాశక్తి - కడప అర్బన్

పిల్లల్లో సృజనాత్మక శక్తి అధికంగా ఉంటుందని రాజయోగిని బ్రహ్మకుమారి గీత దీది అన్నారు. బుధవారం ఓంశాంతి సేవా కేంద్రంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నైతిక విలువలు, మంచి ప్రవర్తన, మంచి అలవాట్లు అనే అంశంపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పోటీ ప్రపంచంలో ఒత్తిడికి గురికాకుండా ముందుకు వెళ్లాలని చెప్పారు. ఫోకస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. అనంతరం 70 మంది పిల్లలకు కానుకలను అందజేశారు.

అధికారంలోకి వచ్చేది వైసిపినే

- వైసిపి గల్ఫ్ కన్వీనర్ బి.హెచ్.ఇలియాస్

ప్రజాశక్తి - కడప

2024 తర్వాత అధికారంలోకి వచ్చేది వైసిపినే అని ఆ పార్టీ గల్ఫ్ కన్వీనర్ బిహెచ్ ఇలియాస్ అన్నారు. 175 స్థానాలకు గాను 135 అసెంబ్లీ స్థానాలు వైసిపి విజయం సాధించి జగన్మోహన్ రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని అన్నారు. బుధవారం కడప పార్లమెంట్ ఇన్‌ఛార్జి, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబును, ఉప ముఖ్యమంత్రి, కడప అసెంబ్లీ వైసిపి అభ్యర్థి అంజాద్‌బాషా, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి రవీంద్రనాథ్ రెడ్డిని గల్ఫ్ ప్రవాసాంధ్రులు కలిశారు. ఈ సందర్భంగా బిహెచ్ ఇలియాస్ మాట్లాడుతూ ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా 2 ఎంపీ స్థానాలు, 13 అసెంబ్లీ స్థానాల్లో భారీ మెజార్టీతో వైసిపి గెలవడం ఖాయం అని అన్నారు. పులివెందులలో టిడిపి అభ్యర్థి బీటెక్ రవి ఓడిపోవడం, కడపలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అంజాద్‌బాషా భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ గల్ఫ్ నుంచి పార్టీ అభ్యర్థుల విజయం కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా కువైట్ నుంచి వచ్చిన ఇలియాస్, బాలిరెడ్డి వారి గ్రూప్ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కువైట్, ఖతార్, వైసిపి కన్వీనర్లు షా హుస్సేన్, జాఫర్ హుస్సేన్, కువైట్ గవర్నింగ్ సభ్యులు షేక్ గఫార్, సుబ్బారెడ్డి, కువైట్ కమిటీ సలహాదారులు ఆబూతురాబ్, కడప ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు షేక్ అన్సర్ బాషా, బాబుబాయి, షేక్ గయాజ్, సౌదీ అరేబియా ఎన్ఆర్ఐ షేక్ అబ్రారర్, కువైట్ ఎన్ఆర్ఐ లు మల్లికార్జునరెడ్డి, సాదిఖ్ లీడర్, షేక్ రాజక్, షరీఫ్, ఇనాయతుల్లా, సద్దాం, దుబాయ్ ఇమ్రాన్, బి.హెచ్. ఎజాస్, అబ్దుల్ రౌఫ్, అఫ్సర్, ఫారూఖ్ పాల్గొన్నారు.

అంజాద్‌బాషాను కలిసిన గల్ఫ్ ప్రవాసాంధ్రులు

కెనాల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

వేసవి సరదా.. ఉల్లాసంగా యువత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వేసవి కాలంలో యువతకు అత్యంత ఉత్సాహాన్నిచ్చేది ఈత. కొందరు యువకులు ఈత కొట్టేందుకు వేసవి కాలంలో కోసం ఎదురు చూస్తుంటారు. ఈత యువత, పిల్లలకు ఎంతో సరదాన్నిస్తుంది. కాలువలు చెరువులు, సంపులు, బావులు కనిపిస్తే చాలు అందులో యువత, పిల్లలు కేరింతలు కొడుతూ సరదాగా గడుపుతారు. మన పెద్దల కాలంలో బావుల్లో ఈత కొట్టేవారు. కాలగమనంలో అవి అదృశ్యమయ్యాయి. ఈ పరిస్థితుల్లో కాలువలు, చెరువులు, వంకలు వ్యవసాయ పంప్‌సెట్లు మాత్రమే ఈత కొట్టేందుకు అనుకూలం. ఈత కొట్టే సమయంలో పిల్లలు పెద్దల సహాయంతో ఈదాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిబ్బందికి శిక్షణనిస్తున్న వైద్యశాఖాధికారులు

నేటి నుంచి క్షయ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం క్షయ వ్యాధి (టి.బి) నిరోధానికి వ్యాక్సినేషన్ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభించడానికి వైద్యశాఖ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. క్షేత్రస్థాయిలో సచివాలయ పరిధిలోని ఎఎన్ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి టిబి నిరోధానికి పూర్తిస్థాయిలో నివేదికలను ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ నేపథ్యంలో ఆయా సచివాలయాల పరిధిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 60ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవడానికి అర్హులన్నారు. మద్యపానం, ధూమపానం, బిపి, షుగర్ వంటి వ్యాధులు ఉన్నవారు ఎఎన్ఎం నివేదికల ఆధారంగా వ్యాక్సినేషన్ వేయించుకోవచ్చు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం..

ప్రభుత్వం క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు బిదనంౌర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షేక్ హుస్సేన్ పీరా తెలిపారు. ప్రతి గురువారం ఆయా సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వాక్సినేషన్ కార్యక్రమంపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరూ వాక్సినేషన్ వేయించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా 'గడికోట' పుట్టిన రోజు

రామాపురం : ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి రానున్నది కూటమి ప్రభుత్వమేని, చంద్రబాబు ముఖ్య అవుతారని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో ఉపాధి కూలీలతో కలసి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి తన 63వ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఉపాధి కూలీలతో కలసి కేక్ కట్ చేసి నిడంబరంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలతో కలసి తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. జూన్ 4 తరువాత పేదప్రజల ప్రభుత్వం వస్తుందని, పేద ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. ఉపాధి కూలీలకు అండగా ఉండి ప్రభుత్వం నుంచి రావాల్సిన లబ్దిని చేకూరుస్తామని తెలిపారు.

ముగిసిన చౌడేశ్వరి జ్యోతి మహోత్సవం

చిన్నమండెం : దేవగుడిపల్లి గ్రామం కొండమూలలో చౌడేశ్వరిమాత జ్యోతి మహోత్సవం ఘనంగా ముగిసిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మ వారిని పుష్ప పల్లకీలో సింహవాహనంపై మంగళవారం రాత్రి జ్యోతులతో ఊరేగించారు. ఉత్సవానికి తొగటవీర క్షత్రియులు, మదనపల్లి, కర్ణాటక నుంచి భారీ ఎత్తున తరలివచ్చారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - చాపాడు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం మండల పరిధిలోని చిన్నగురువలూరు పోలింగ్ బూత్ నెంబర్ 168లో టిడిపి ఏజెంట్లుగా ఉన్న కుచ్చుపాప వినోద్‌కుమార్, తన అన్న ఉగ్ర నరసింహుడు కూర్చున్నారు. వీరిని పోలింగ్ బూత్ నుండి బయటకు లాగి, కొట్టి, కులం పేరుతో తిట్టి హత్యాయత్నం చేసిన వారిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. కుచ్చుపాప వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు చాపాడు పోలీసు స్టేషన్ క్రైం నెం.67/2024, 147, 148, 324, 307, 149 ,3(1), 3(2) ఎస్‌సి, ఎస్‌టిగా కేసును నమోదు చేశారు. మైదుకూరు డిఎస్‌పి వెంకటేశులు ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సర్కిల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి, చాపాడు ఎస్ఐ కొండారెడ్డి నిందితులు పాలగిరి లక్ష్మీ నారాయణరెడ్డి, పాలగిరి వెంకట సుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గంజికుంట హర్షవర్ధన్‌రెడ్డి, కొండయ్యగారి శంకర్‌రెడ్డి, బొర్రా శంకర్‌రెడ్డి, కారుమళ్ల భాస్కర్‌రెడ్డి, పాలగిరి చంద్రమోహన్‌రెడ్డి, యర్రన్నగారి చంద్ర ఓబుల్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను అరెస్టు చేయడంపై ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పోలీసులను అభినందించారు.

వైసిపి పోలింగ్ ఏజెంట్‌పై దాడి

మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు భూమిరెడ్డి చంద్ర ఓబుల్‌రెడ్డిపై బుధవారం టిడిపి నాయకులు దాడికి పాల్పడ్డారు. మైదుకూరు పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. సోమవారం జరిగిన పోలింగ్‌లో చంద్రఓబుల్‌రెడ్డి వైసిపి తరఫున ఏజెంట్‌గా కూర్చున్నాడనే కారణంతో అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కార్తీక్‌రెడ్డి, బొచ్చు సుబ్బారెడ్డి, ఇల్లూరి సుబ్బారెడ్డి బుధవారం సాయంత్రం మైదుకూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో ఘర్షణకు దిగారు. ఈ సంఘటనలో బీరు సీసాలు తీసుకొని తలపై కొట్టడంతో చంద్రఓబుల్‌రెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడ్ని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పరామర్శించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మైదుకూరు డిఎస్‌పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బాధితుడ్ని విచారించారు. చంద్రఓబుల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గాయపడిన చంద్రఓబుల్‌రెడ్డి

ప్రకృతిలో దొరికే పండ్లతో ఆరోగ్యం

బంకీరు చెట్టు, పండ్లలో పలు ఔషధ గుణాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రకృతి మనకు వివిధ రకాల ఔషధ గుణాలు కలిగిన పండ్లను కూడా ప్రసాదించింది. అలాంటి పండ్ల చెట్లల్లో బంకీరు చెట్టు కూడా ఒకటి. దీన్నే విరిగి కాయల చెట్టు, నక్కెర పండ్ల చెట్టు, బంక నక్కెర చెట్టు, యంక కాయల చెట్టు అని కూడా పిలుస్తారు. ఈ చెట్లు మనకు ఎక్కువగా గ్రామాల్లో, రోడ్ల పక్కన కనిపిస్తాయి. చాలామంది ఈ నక్కెర పండ్లను ఎంతో ఇష్టంగా తింటారు. పండిన కాయలు మరింత రుచిగా ఉంటాయి. ఈ కాయలు లోపల బంకలాగా తియ్యగా ఉంటాయి. కొందరు ఈ నక్కెర కాయలతో పచ్చడి చేసుకుంటారు. దీన్నే ఇంగ్లిష్‌లో ఇండియన్ చెర్రీని అని, హిందీలో లసోరా, లసోడా అని పిలుస్తారు. ఈ కాయలు గుత్తుగుత్తులుగా కాస్తాయి. ఈ పండ్లు, చెట్టు ప్రతి భాగం కూడా ఔషధ గుణాలను, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ బయోటిక్ గుణాలను కలిగి ఉంటాయి. ఈ బంకీరు పండ్లు మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో కూడా లభిస్తాయి. వీటిల్లో మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. క్యాల్షియం, జింక్, ఐరన్, ప్రోటీన్స్, కాపర్, జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. ఈ పండ్లను తినడం వల్ల శరీరానికి మేలు కలుగుతుంది. చలువ చేస్తుంది. రక్తదోషాలు పోతాయి. లైంగిక సామర్థ్యం మెరుగుపడుతుంది. పురుషులు ఈ పండ్లను తీసుకోవడం వల్ల వారిలో వీర్య కణాల సంఖ్య పెరుగుతుంది. ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తున్నారు. బంకీరు పండ్లను తినడం వల్ల జీర్ణ సామర్థ్యం పెరుగుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి సమస్యలతో బాధపడే వారు ఈ పండ్లను తినడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మన ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ ఈ పండ్లను చాలా తక్కువగా తీసుకోవాలి. రోజూ పది పండ్ల కంటే ఎక్కువగా తీసుకోకూడదు. విరిగి చెట్టు ఆకులకు తలనొప్పిని తగ్గించే గుణం ఉంది. ఈ చెట్టు లేత ఆకులను పేస్ట్‌గా చేసి నుదుటిపై రాసుకోవాలి.

ఆరోగ్యాన్నిచ్చే బంకీర్ పండ్లు

ఇలా చేయడం వల్ల కొంత సమయానికి తలనొప్పి తగ్గుతుంది. ఈ చెట్టు బెరడును పేస్ట్‌గా చేసి చర్మ సమస్యలు ఉన్న చోట లేపనంగా రాసుకుంటే తగ్గిపోతాయి. ఈ చెట్టు బెరడును నీటిలో వేసి మరిగించాలి. తర్వాత ఈ నీటిని వడకట్టగా వచ్చిన కషాయాన్ని నోట్లో పోసుకుని పుక్కిలించాలి. ఇలా చేయడం వల్ల దంతాలు, చిగుర్లు ధృఢంగా, ఆరోగ్యంగా మారతాయి. నోటి దుర్వాసన తగ్గుతుంది. నోటి పూత కూడా తగ్గుతుంది. నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ బెరడు కషాయంతో గాయాలను కడగడం వల్ల త్వరగా మానుతాయి. ఈ విధంగా బంకీరు పండ్లు, చెట్టు మనకు ఎంతగానో మేలు చేస్తాయని, వీటిని ఉపయోగించడం వల్ల మంచి ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

అంధకారంలో మల్లికార్జునపురం

మూడు రోజులుగా చీకటిలో.. నీరు లేక ఇక్కట్లు - సబ్‌స్టేషన్ వద్ద ప్రజల ధర్నా

ఇ.కొత్తపల్లె సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మండలంలోని మల్లికార్జునపురం గ్రామ ప్రజలు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. గ్రామ ప్రజలు మూడు రోజులు నుంచి అంధకారంలో ఉండిపోయారు. సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు సబ్‌స్టేషన్ వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని మల్లికార్జునపురం వాసులు కారు చీకట్లో గడుపుతున్నారు. గత మూడు రోజుల క్రితం గాలివానకు కరెంటు స్తంభాలు నేలకొరిగిన విషయం తెలిసిందే. మూడు రోజులు గడుస్తున్నా ఇంతవరకు మరమ్మతులు చేయకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి కరెంట్ లేక తాగునీరు కూడా దొరకని పరిస్థితి. చీకట్లో నడవాలంటే విష పురుగులుతో భయపడుతున్నారు. సమస్యను మూడు రోజులుగా అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఏమాత్రం పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక చేసేది ఏమీ లేక వారు ఇ.కొత్తపల్లి సబ్‌స్టేషన్ ఎదురుగా ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకొని ప్రజలతో మాట్లాడారు. మీ ఇళ్లల్లో కరెంటు లేకపోతే అలాగే ఉంటారా అని ఆందోళనకారులు అధికారులను ప్రశ్నించారు. కనీసం ఒక గంట కరెంటు లేకపోయినా ఉండలేని పరిస్థితుల్లో మూడు రోజులుగా ఎలా అని, మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని అధికారులను నిలదీశారు. గ్రామం చుట్టూ తోటలు ఉన్నందువలన విషపురుగులు వస్తున్నాయని భయపడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో భయం గుప్పిట్లో, ఉక్కబోతకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని తెలిపారు. వెంటనే స్పందించి మల్లికార్జున పురంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు కోరారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ సాయంత్రం లోపు విద్యుత్ సరఫరా వచ్చేలా చేస్తామని ప్రజలను శాంతింపజేశారు. ప్రజలు ధర్నాను విరమించారు.

వెంకటాపురం, గొల్లపల్లెలో అపరిశుభ్రత తిష్ట

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం, గొల్లపల్లె వార్డుల్లో మురుగు సమస్య తిష్ట వేసింది. మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తూ అధ్వాన్నంగా తయారైంది. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోకి ఆయా గ్రామాలను 2012లో చేర్చారు. మున్సిపాలిటీ ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తయినప్పటికీ కనీస అవసరాలను తీర్చే పరిస్థితిలో ప్రభుత్వాలు లేవు. ఆ గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు నానా అవస్థలు పడాల్సివస్తోంది. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేసినప్పటికీ మురుగు కాలువలు లేకపోవడంతో వ్యర్థ నీరు రోడ్లపై నిలుస్తోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. గత ప్రభుత్వం మున్సిపాలిటీకి రూ.9 కోట్లు నిధులు మంజూరైనప్పటికీ వాటిని సద్వినియోగం పరచడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు సమాచారం. రూ.3.5 కోట్లు మాత్రమే వెచ్చించి సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కూడా సరైన రీతిలో వినియోగించని పరిస్థితుల్లో మున్సిపాలిటీ కొనసాగుతోంది. నిధులు పక్కదారి పట్టడంతో అధికారులపై కేసులు కూడా నమోదు చేశారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని వార్డులు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన నూతన పాలకవర్గం కూడా అభివృద్ధి బాటలో నడిపించడంలో వెనుకబడిందని చెప్పవచ్చు. నిధులు పూర్తిస్థాయిలో వినియోగించడంలో విఫలం కావడంతో పనులు చాలావరకూ కుంటుపడ్డాయి. గతంలో అధికారంలో ఉన్న పాలకవర్గం కూడా మురుగు కాలువలు ఏర్పాటుకు చొరవ చూపకపోవడంతో నేటికీ రోడ్లపైనే మురుగునీరు దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గొల్లపల్లిలో రోడ్డుపైన నిలిచిన మురుగునీరు

నిలిచిపోయిన సిసి రోడ్డు పనులు

అవస్థలు పడుతున్న పాదచారులు, వాహనదారులు

అసంపూర్తిగా ఉన్న సిసి రోడ్డు పనులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులు ఆగిపోయాయి. ఈ పరిస్థితుల్లో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దాదాపు రూ.మూడు కోట్ల వ్యయంతో వెల్డింగ్ బాబు ఇంటి దగ్గర నుంచి బస్టాండ్ వరకు వైయస్సార్ సర్కిల్ మీదుగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. విద్యుత్ దీపాలు, డివైడర్ ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయినప్పటికీ.. మిగిలిన పనులు వదిలేయడంతో అవస్థలు తప్పడంలేదు. ముఖ్యంగా పెట్రోల్ బంకు సమీపం నుంచి బస్టాండ్ వరకు ఓ వైపు ఆగిపోయాయి. ఈ పనులను ఎన్నికల ముందు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్న కారణంగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలోని సింహాద్రిపురం మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి హోదాలో ప్రారంభించారు. గత ఏడాది డిసెంబర్ 23న సింహాద్రిపురం మండల పర్యటనలో భాగంగా సిఎం జగన్ సిమెంట్ రోడ్డు లాంఛనంగా ప్రారంభించారు. అయితే అప్పటికే పనులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రారంభించారు. ప్రారంభించి నాలుగు నెలలు పూర్తయినా పనులు పూర్తి కాకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బి ఎఇ సోమశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. పనులు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే అన్నారు. ఆ పనులను త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కడప కైఫీయత్తుల సజీవ దార్శనికుడు 'కట్టా'

ప్రజాశక్తి - మైదుకూరు

కడప కైఫీయత్తుల సజీవ దార్శనికుడు కట్టా నరసింహులని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య తెలిపారు. మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీ విద్వాన్ కట్టా నరసింహులు వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సభకు రచయిత, చరిత్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ ఒంటిమిట్ట రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు పట్టు వస్త్రాలు ప్రభుత్వం అందించుటలో కట్టా సలహాలు, కట్టా రాసిన పుస్తకాలు కారణమయ్యాయని గుర్తు చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు పొలిమేర ఓబయ్య మాట్లాడుతూ కట్టాకు నేను ఏమి చెప్పినా పాటించేవాడని, ఆయన గతంలో తనకు కొంత ఆర్థిక సహాయం చేశాడని తెలిపారు. భౌతిక శాస్త్రఉపాధ్యాయుడు డివి సుబ్బానాయుడు మాట్లాడుతూ అక్షరరశ్మి అనే పత్రికలో కట్టాతో కలిసి పని చేశానని చెప్పారు. రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి ప్రసంగిస్తూ తమ పార్వతీనగర్ గురించి, కళాకారుల గురించి అనేక కథలు కట్టా నరసింహులు రాశారని వివరించారు. మరో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎవి రమణయ్య మాట్లాడుతూ కట్టా నరసింహులుతో జనవిజ్ఞాన వేదికలో కలిసి పని చేసినప్పుడు ఎయిడ్స్ మీద పాట ఆయన రాశారని చెప్పారు. కార్యక్రమంలో సాహితీప్రియులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కట్టా నరసింహులుకు నివాళులర్పిస్తున్న సాహితీప్రియులు

కాటన్ దొర చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

కాటన్ దొరకు ఘన నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

సర్ ఆర్థర్ కాటన్ దొర అపర భగీరథడు, నదుల అనుసంధానానికి ఆద్యుడని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కాటన్ దొర 221వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కాటన్ దొర ఆంగ్లేయుడు అయినప్పటికీ సమాజ సేవ పరమవధిగా భారతీయుల, ప్రత్యేకించి ఆంధ్రుల హృదయాల్లో నిలిచిపోయారని ప్రశంసించారు. 1842-1852 మధ్య కాలంలో గోదావరి నది మీద ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి సస్యశ్యామలం చేసినట్లు చెప్పారు. కృష్ణా నదిపై విజయవాడ వద్ద, కావేరి నదిపై ఆనకట్టల నిర్మాణం కాటన్‌దొర కృషేనని తెలిపారు. కాటన్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాగునీటి రంగానికి ఎంతో ప్రాముఖ్యతనిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, బీగాల రామకృష్ణ, ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, వినయ్, శివ పాల్గొన్నారు.

సిబిఎస్ఇ ఫలితాల్లో వైష్ణవి ప్రతిభ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

సిబిఎస్ఇ ఫలితాల్లో మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పోలు బ్రహ్మానందరెడ్డి కుమార్తె పోలు వైష్ణవి 496/500 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్రంలో మొదటి ర్యాంకు పొందారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ప్రభుత్వ అధికారులు యథావిధిగా తమ విధుల పట్ల శ్రద్ధ వహించాల్సి ఉంది. ఎన్నికల సీజన్ కావడంతో ప్రభుత్వ అధికారులందరూ ప్రజా సమస్యలపై దృష్టి సారించలేకపోయారు. గత నాలుగు నెలలుగా ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారం వైపు అడుగులు వేయాలని పలువురు సూచిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ సమస్యలు అధికంగా వేధిస్తున్నాయని గ్రామీణులు వాపోతున్నారు. విద్యుత్ తీగలు కిందికి వేలాడడం, స్తంభాలు నేలకొరగడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రజలు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలో కడప ప్రధాన రహదారిపై ఓ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. తీగెలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాన్ని మార్పు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు పలుమార్లు అధికారులను కోరారు. అయినా వారిలో స్పందనలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండడంతో గాలుల ఎక్కువగా వీచే అవ కాశం ఉందని, ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆ ప్రాంత ప్రజలు భయాందోళలను వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబు శకం ముగిసింది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈ ఎన్నికలతో చంద్రబాబు శకం ముగిసిందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. కుప్పంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేష్, హిందూపురంలో బాల కృష్ణకు ఓటమి తథ్యంమని తెలిపారు. వైసిపి నాయకడు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంటిలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో రాష్ట్రవ్యాప్తంగా 120 నుండి 135 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి గెలువబోతోందని అన్నారు. తనకున్న ఖచ్చితమైన సమాచారం మేరకు ఈ ప్రకటన చేస్తున్నానన్నారు. పేద లబ్ధిదారులకు సంక్షేమ పథకాలైన చేయూత, ఆసరా, ఇన్‌ఫుట్ సబ్సిడీ పథకాల నగదు నేడోరేపో వారి ఖాతాల్లో చేరబోతోందన్నారు. ఎన్నికల ముందు సంక్షేమ పథకాలను ఆపి ఇప్పుడు ఆ మొత్తం కాంట్రాక్టర్లకు చేరుస్తున్నారని బాబు అబద్ధపు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. తాను గెలిచినట్లు.. ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు చంద్రబాబు అధికారులను భ్రమలోకి నెడుతున్నారని, బాబుది కేవలం దింపుడుకళ్లెం ఆశే అన్నారు. జగన్ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రాబోతోందన్నారు. ఇక అధికారిక ప్రకటన మాత్రమే మిగిలిందని రాచమల్లు తెలిపారు. జూన్10 నుండి జగన్ వైజాగ్ నుండి పాలన అందించబోతున్నారన్నారు.

మాట్లాడుతున్న రాచమల్లు

అరటి రైతులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గాలుల వల్ల నష్టపోయిన అరటి రైతులకు అండగా ఉంటామని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లి గ్రామపరిధిలో గాలులకు పడిపోయిన అరటి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం నుంచి పరిహారం అందేల చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి